రోగ నిర్ధారకులేరి?



జనగామలోని తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం

జనగామ డయాగ్నస్టిక్ సెంటర్‌లో సిబ్బంది కరువు

- పాథాలజిస్ట్, బయోకెమిస్ట్ పోస్టులు ఖాళీ
- ధ్రువీకరణ అంతా ల్యాబ్ టెక్నీషియన్లదే..
- కొద్దిపాటి సిబ్బందిపైనే సేవల భారం
- పర్యవేక్షణ బాధ్యతలపైనా అస్పష్టత

జనగామ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చుల భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్(టీ-హబ్) సెంటర్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లను జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసింది. మొదట కొన్ని జిల్లాల్లోనే ప్రారంభించగా ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించింది. ఇందులో భాగంగా జనగామ జిల్లాకేంద్రంలో మొదటి విడత కిందే తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటైంది. ఈ సెంటర్‌ను 2021 జూన్ 14న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. మొదట్లో 57 రకాల రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించగా 2023 జూలై నెలలో అప్‌గ్రేడ్ చేస్తూ కొత్తగా 77 రకాల పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో మొత్తంగా 134 రకాల పరీక్షలు డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేస్తున్నారు. గత ఏడాది జూలై 1న రాష్ట్ర వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్‌గా డయాగ్నస్టిక్ సెంటర్ల అప్‌గ్రేడ్‌ను ప్రారంభించగా జనగామలోని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమంలో అప్పటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

అరకొర సిబ్బందితోనే..

డయాగ్నస్టిక్ సెంటర్‌లో రక్త, మూత్ర పరీక్షలు చేయడం, వచ్చిన రిపోర్టులను సరిచూసి ధ్రువీకరించడం, నిర్వహణ వంటి వాటి కోసం సరిపడా సిబ్బంది లేరు. దీంతో నిర్వహణ, పనితీరు అస్తవ్యస్తంగా మారింది. వాస్తవానికి సెంటర్ నిర్వహణ బాధ్యతలు చూసేందుకు ల్యాబ్ మేనేజర్‌తో పాటు రక్త, మూత్ర పరీక్షలు చేసేందుకు 10 మంది ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాలి. అవసరమయ్యే రసాయనాలు, సామగ్రి నిర్వహణ కోసం ఒక ఫార్మసిస్టు, ఇతర పనుల కోసం ఒక ఉద్యోగి ఉండాలి. వీరితో పాటు రక్త, మూత్ర పరీక్షలు చేశాక వచ్చిన రిపోర్టులను పరిశీలించి ధ్రువీకరించేందుకు ఒక పాథాలజిస్టు, ఒక బయోకెమిస్ట్, ఒక మైక్రోబయాలజిస్టు కచ్చితంగా ఉండాలి. కానీ.. వీరిలో ఒక ల్యాబ్ మేనేజర్, 9 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్ప మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రారంభం నుంచే అవసరమయ్యే సిబ్బందిని నియమించలేదు. దీంతో అరకొర సిబ్బందితోనే రక్త, మూత్ర పరీక్షలు చేయాల్సి వస్తోంది. సిబ్బంది సరిపడా లేకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతోంది. దీనితో పాటు డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహణ బాధ్యతలు ఎవరు చూడాలన్న దానిపై కూడా సందిగ్ధత నెలకొంది. మొదట్లో ప్రజారోగ్య పరిధిలోని డీఎంహెచ్‌వో బాధ్యతలు చూసేవారు. ఆ తర్వాత వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వెళ్లగా తాజాగా వైద్య విద్య కమిషనర్ పరిధిలోని జనగామ మెడికల్ కాలేజీ కిందకు వెళ్లినట్లు చెబుతున్నారు. కాగా.. వీరిలో డయాగ్నస్టిక్ సెంటర్ తమ పరిధి కాదంటే తమ పరిధి కాదని పక్కకు తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది.

ల్యాబ్ టెక్నీషియన్ల రిపోర్టే ఫైనల్

పరీక్షల రిపోర్టులను ధ్రువీకరించాల్సిన వైద్యులు లేకపోవడంతో ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చిన రిపోర్టులే ఫైనల్ పరిగణించాల్సి వస్తోంది. జిల్లాలో 17 పీహెచ్‌సీలు, జనగామ జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్‌తో పాటు సిద్ధిపేట జిల్లాలోని మద్దూరు, లద్నూరు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, టీటీనగర్ పీహెచ్‌సీల నుంచి రక్త, మూత్ర శాంపిల్స్ ఇక్కడికి వస్తుంటాయి. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల లోగా ఆయా పీహెచ్‌సీల నుంచి శాంపిల్స్ జనగామకు చేరుకుంటాయి. వీటిని ల్యాబ్ టెక్నీషియన్లు అత్యాధునిక యంత్రాల ద్వారా పరీక్షలు చేస్తారు. పూర్తయ్యాక వచ్చిన వివరాలతో డాక్టర్లు రిపోర్ట్ తయారు చేసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆయా టెస్టులకు సంబంధించి పాథాలజిస్ట్ గానీ, బయో కెమిస్ట్ గానీ, మైక్రోబయాలజిస్ట్ గానీ ధ్రువీకరణ చేయాలి. ప్రస్తుతం ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చిన రిపోర్టులే ఫైనల్‌గా భావించాల్సి వస్తోంది. దీంతో రిపోర్టుల విషయంలో ప్రజల నుంచి కొన్ని అనుమానాలు వస్తున్నాయి. తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేసిన పరీక్షలకు, బయట ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేసిన పరీక్షల్లో తేడా ఉంటుందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. రిపోర్టులు ధ్రువీకరించాల్సిన డాక్టర్లు లేకపోవడంతో సెంటర్‌లో నిర్వహించే టెస్టులపైనే ప్రజలకు అనుమానాలు కలిగే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తగి సిబ్బందిని నియమించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



దృష్టి సారిస్తే మేలు

తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించి అవసరమైన సిబ్బందిని నియమిస్తే పేదలకు మేలు జరగనుంది. ప్రారంభం నుంచి డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు అందుతున్నాయి. చిన్న చిన్న పరీక్షలే కాకుండా ఎక్కువ ఖర్చుతో కూడుతున్న రక్త, మూత్రం, కాలేయం, వీర్య, ఇతర అవయవాల పనితీరు పరీక్షలు కూడా ఉచితంగా జరుగుతున్నాయి. జనగామ తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్(టీ-హబ్)కు జాతీయ స్థాయి గుర్తింపు సైతం గతంలో లభించింది. టీ-హబ్‌లో చేస్తున్న రక్త, మూత్ర పరీక్షలు, ఫలితాల వెల్లడిలో నాణ్యత ఆధారంగా 'నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబరేషన్ లాబొరేటరీస్'(ఎన్‌ఏబీఎల్) సర్టిఫికేట్‌కు గత ఏడాది ఎంపికైంది.

ఇప్పటి వరకు 5,51,885 పరీక్షలు

తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 1,78,521 మంది పేషెంట్ల నుంచి 2,93,657 శాంపిల్స్‌ను సేకరించగా 5,51,8885 రకాల పరీక్షలను చేశారు. సీజనల్ వ్యాధుల సమయంలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి పరీక్షలతో పాటు థైరాయిడ్, హెచ్‌బీఏవన్‌సీ, లివర్ ఫంక్షనింగ్, కిడ్నీ ఫంక్షనింగ్, కొలెస్ట్రాల్, చికెన్ గున్యా, గ్లూకోజ్, అల్బ్యూమిన్, క్యాల్షియం, ఎస్‌జీపీటీ, సీరమ్ క్రియేటినైన్, డైరెక్ట్ బిలిరుబిన్, ట్రైగ్లిసెరైడ్, డీఎల్‌డీఎల్, డీహెచ్‌డీఎల్, ఎలక్ట్రోలైట్స్ వంటి 134 పరీక్షలను చేస్తున్నారు. శాంపిల్స్ తీసుకున్న 24 గంటల్లోగా రోగుల ఫోన్లకు మెసేజ్ రూపంలో రిపోర్టులను పంపిస్తున్నారు. దీనితో పాటు ఆయా పీహెచ్‌సీ లాగిన్‌లకూ రిపోర్టులు వెళ్తున్నాయి.

ఎడతెరిపి లేని వర్షం.. పత్తి పంటకు నష్టం


రఘునాథపల్లిలో పెరుగుదల నిలిచిపోయిన పత్తి చేను

రఘునాథపల్లి, జూలై 28: అతివృష్టి అయినా.. అనావృష్టి అయినా అన్నదాతకే నష్టం. ఆరుగాలం కష్టపడిన అన్నదాతకు పంట దిగుబడిపై గ్యారంటీ లేదు. భగవంతుడి మీద భారం వేయడం తప్ప ఏమి చేయలేని దుస్థితి. రఘునాథపల్లి మండలంలో ఎన్నో ఆశలతో పత్తి పంట సాగు చేసిన రైతులకు ఎడతెరిపి లేని వానలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. నల్ల రేగడి నేలల్లో సాగు చేసిన పత్తి మొక్కలు పెరగడం లేదు. ఆకులు ఎర్రబడుతూ ముడుత తెగులు సోకుతోంది. చీడపీడలు దాడి చేస్తున్నాయి. కలుపు మొక్కలు విపరీతంగా పెరగడంతో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. ముసురు ఆగిపోతేనే పత్తి చేలకు పురుగు మందులను పిచికారి చేసే అవకాశం ఉంటుంది. ఎడతెరిపి లేకుండా ముసురు పడుతుండడం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాది కుడా వర్షాల కారణంగా దిగుబడి కోల్పోయి నష్టపోయిన రైతులకు ఈ సంవత్సరం సైతం అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న భయం పట్టుకుంది.

ఏసీరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

- వర్ధంతి సభలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

జనగామ రూరల్, జూలై 28: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పోరాడిన వ్యక్తి ఏసి రెడ్డి నర్సింహారెడ్డి అని, ఆయన జీవితం ప్రజలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆయన 33వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా నుంచి కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్ధంతి సభను నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరై ఏసీ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భాగంగా ఏసిరెడ్డి నైజాం సర్కార్, దొరల తుపాకీ తూటాలకు బలయ్యారని గుర్తు చేశారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేద ప్రజలందరికీ ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కులాల, మతాల మధ్య చిచ్చు పెడుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు, సింగారపు రమేష్, బొట్ల శ్రీను, గోపి, జోగు ప్రకాశ్, సందీప్, ధర్మభిక్షం పాల్గొన్నారు.


ఇన్నోవేటర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

ఇన్నోవేటర్స్‌గా రాణించాలి : ఎమ్మెల్యే పల్లా


జనగామ రూరల్, జూలై 28: కొత్త ఆలోచనలతో ఇన్నోవేటర్స్‌గా రాణించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఇన్నోవేటర్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో సంబంధం లేకుండా తెలివితేటలే ప్రాతిపదికగా సృజనాత్మకతతో కొత్త అంశాలను వెలుగులోకి తెచ్చి జిల్లా కీర్తిని దేశస్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్నోవేటర్ కోఆర్డినేటర్ కళ్యాణి, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, కౌన్సిలర్ దయాకర్, నాయకులు బండ యాదగిరి రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ మట్టి.. కొల్లగొట్టి..

- సాగునీటి కాల్వల వెంట రోడ్లను ధ్వంసం చేస్తున్న రియల్టర్లు


వడ్డిచర్లలో కెనాల్ మట్టిని జేసీబీ సాయంతో తరలిస్తున్న రియల్టర్లు

లింగాలఘణపురం, జూలై 28: రియల్టర్ల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది.. ఏమాత్రం అవకాశం లభించినా అడ్డగోలు దందాలకు తెరలేపుతున్నారు.. లింగాలఘణపురం మండలం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే ఉండటంతో వ్యవసాయభూములన్నీ కమర్షియల్ భూములుగా రూపాంతరం చెందుతున్నాయి. వ్యవసాయభూములను కొనుగోలు చేస్తున్న రియల్టర్లు వాటికి చదునుపేరిట మెరుగులు దిద్ది కాసుల పంటను పండించుకుంటున్నారు. తాజాగా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లలో ఓ రియల్టర్ సాగునీటి కాలువ పక్కనే ఉన్న ఎకరం వ్యవసాయభూమిని కొనుగోలు చేసి లోతట్టుమయంగా ఉన్నదానిని లెవలింగ్ చేసేందుకు శ్రీకారం చుట్టారు. పల్లం వైపు ప్రాంతాన్ని మట్టితో ఎత్తుపెంచేందుకు మట్టి అందుబాటులో లేకపోవడంతో పక్కనే సాగునీటి కాల్వ వెంట ఉన్న మట్టిపై కన్నేశారు. కాల్వ పక్కకే ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డును ధ్వంసం చేసి అక్కడి మట్టిని జేసీబీ సాయంతో తన పొలంలోకి తరలించుకుపోయారు. ఇది గమనించిన స్థానిక రైతులు మట్టిని తరలించకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ రియల్టర్లు తమ అక్రమాలను కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ
- ఈ సీజన్ నుంచే మొదలు పెట్టే ఆలోచన
- త్వరలో మార్గదర్శకాలు జారీ
- అప్రమత్తమవుతున్న వ్యవసాయ శాఖ
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు

వివరాలు : 7 లో..

నష్కల్ గ్రామస్థుల నరకయాతన

- పొలాలవద్దకు వెళ్లాలంటే నాటుపడవలే దిక్కు
- వర్షాకాలంలో ఇబ్బందిపడుతున్న గ్రామస్థులు
- బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే కడియంకు విన్నపం


నాటుపడవలో ఆకేరువాగును దాటుతున్న నష్కల్ గ్రామ రైతులు (ఫైల్)

చిలుపూర్, జూలై 28: మండలంలోని నష్కల్ గ్రామ రైతులు వర్షాకాలంలో వారి పంట పొలాలకు వెళ్లాలంటే పడవ ప్రయాణమే దిక్కు. లేదంటే 25 కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సిందే. ఈ విషయంలో రైతులు ఏళ్ళ తరబడి ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం చొరవ చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. నష్కల్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న 80 మంది రైతులకు ఆకేరువాగు అవతలి వైపున, ఉప్పుగల్లు, పాంనూర్ గ్రామాలకు వెళ్ళే మార్గంలో 400ల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వారు పొలాలకు వెళ్ళాలంటే మధ్యలో ఆకేరు వాగు దాటాలి. లేదంటే ఘన్‌పూర్, పాంనూర్ మీదుగా ఉప్పుగల్లుకు వెళ్లాలి. అలా వెళ్లాలంటే అదనంగా 25 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అదే వాగు నుంచి వెళ్తే ఒక కిలోమీటర్‌లో వెళ్లొచ్చు. అయితే ఈ సమస్య ఒక్క వర్షాకాలంలోనే ఎదురవుతుంది. మిగతా రోజుల్లో తాత్కాలిక రోడ్డుపై నుంచి వెళతారు.

గతంలో ఆకేరువాగుపై ఎగువన ఉన్న చెక్ డ్యాం నుంచి నీళ్ళు ఉధృతంగా ప్రవహిస్తున్నా, వాగుదాటే అవకాశం ఉండేది. ప్రస్తుతం గ్రామానికి దిగువన ఉప్పుగల్లు రిజర్వాయర్ ఉండడం.. దానిలో నీళ్ళు పుష్కలంగా ఉండడంతో వాగు వరదనీటితో నిండి ఉంటోంది. దీంతో తాత్కాలిక రోడ్డు మునిగిపోయి వాగు దాటే పరిస్థితులు ఉండవు. ఈ క్రమంలో రైతులు నాటు పడవల సాయంతో పొలాలకు వెళ్తున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టి సారించి ఆకేరువాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మిస్తే మూడు గ్రామాలకు మేలు

ఆకేరువాగుపై బ్రిడ్జి నిర్మిస్తే మూడు గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. నష్కల్‌తో పాటు, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని పాంనూర్, జఫర్‌గడ్ మండలంలోని ఉప్పుగల్లు గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అధికారులు గతంలో రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.


మత్తడి పోస్తున్న ఆకేరువాగు చెక్‌డ్యామ్

ఎమ్మెల్యే కడియంపైనే ఆశలు..


- కర్ణకంటి స్వప్న, మాజీ సర్పంచ్, నష్కల్



ఆకేరువాగుపై బ్రిడ్జి నిర్మించే విషయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిపైనే ఆశలు పెట్టుకున్నాం. ఏళ్ళ తరబడి పేరుకుపోయిన సమస్యకు కడియంతోనే ఫుల్‌స్టాప్ పెడుతారన్న నమ్మకం ఉంది. సమస్యను గతంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సమస్యను విన్నవించడంతో పాటు, బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలో అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను సైతం అందించాం.

నాటుపడవలో పొలాల వద్దకు వెళ్తున్నాం..


కర్ణకంటి శ్రీహరి, రైతు, నష్కల్



రైతుల సమస్యపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం బాధాకరం. విధిలేని పరిస్థితుల్లో రైతులమంతా కలిసి తలా కొంత డబ్బును పోగు చేసుకుని నాటుపడవను కొనుగోలు చేశాం. భయానక పరిస్థితుల మధ్య రాకపోకలు సాగించడంతో పాటు, పొలాల్లో పండిన పంటను కొద్దికొద్దిగా తరలించేందుకు చర్యలు చేపడుతున్నాం. నేతలు స్పందించి బ్రిడ్జి నిర్మిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

నేతల హామీలు అమలు కావడం లేదు..

గంటె ఉపేందర్, బీజేపీ మండలాధ్యక్షుడు, నష్కల్



ఆకేరువాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతూ.. పలుమార్లు నేతలకు విన్నవించినా ఫలితం శూన్యం. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు ఆకేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి. అందుకోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. సమస్య పరిష్కరిస్తే మూడు గ్రామాలకు రాకపోకలు సాగుతాయి.

అంధుడి కుటుంబంలో 'ఖాకీ' వెలుగులు

● దీనస్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించి బాసట ● పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



నూతన ఇంటి ముందు ఎస్పీ సుధీర్‌రాంనాథ్

నర్సింహులపేట, జులై 28 : దీనస్థితిలో ఉన్న ఓ అంధుని కుటుంబంలో పోలీసులు వెలుగును నింపారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారి సూచన మేరకు స్థానిక ఎస్సై గండ్రాతి సతీష్ తన సిబ్బందితో కలిసి కొందరు దాతల ఆర్థిక సాకారంతో నూతన ఇల్లు నిర్మించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. నర్సింహుల పేట మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన నిరుపేద అంధుడు మందుల నాగన్న పాటలు పాడుతూ వచ్చిన కొద్దోగొప్పో డబ్బుతో తన కుటుంబాన్ని సాకుతున్నాడు. పుట్టుకతోనే అంధుడు కావడంతో తనకు తోడుగా వచ్చే తల్లి బక్కమ్మ ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురికావడంతో పాటు తను ఉండే ఇల్లు శిథిలావస్థకు చేరిందన్న విషయం స్థానిక పోలీసుల ద్వారా జిల్లాపోలీస్ అధికారికి చేరింది. వెంటనే స్పందించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అంధుని కుటుంబానికి అండగా ఉంటానని, దాతలు ముందుకు వచ్చేలా చొర వ తీసుకోవాలని ఎస్సై సతీష్‌కు సూచించారు. ఎస్పీ సూచనల మేరకు ఎస్సై సతీష్ సిబ్బందితో అంధుడి ఇంటికి చేరుకున్న అతని దీనస్థితిని చూసి చలిం చి, తక్షణ సాయంగా నిత్యావసర సరుకులు ఇచ్చాడు. గూడు నిర్మించేలా సహకారం అందిస్తామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చాడు. మండలానికి చెందిన కొందరు దాతలు జినుకల రమేశ్, ఉల్లి శ్రీను, శ్రీరాం శేషయ్య, నలమాస రాజు, దాసరోజు రాజశేఖర్‌తో పాటు మరికొందరి సహకారంతో సుమారు రూ.2.50 లక్షలతో రెండుగదుల ఇంటి నిర్మాణాన్ని 20 రోజుల వ్యవధిలోనే చేపట్టారు. ఆ నూతన గృహాన్ని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదివారం ప్రారంభించి, అంధుడు నాగన్నకు తల్లి బక్కమ్మకు నూతన వస్త్రాలను అందజేశారు. ఇంటి ఆవరణలో మామిడి మొక్కను నాటారు.

అక్రమ వ్యాపారాలు చేస్తే ఉపేక్షించం..

జిల్లాలో గుడుబా, నల్లబెల్లం, గాంజా లాంటి అక్రమవ్యాపారాలు చేస్తే ఉపేక్షించేదిలేదని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హెచ్చరించారు. పెద్దనాగారంలో నూతన గృహాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులు శాంతి భద్రతల నిర్వహణతో పాటు సమాజంలో సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. పనితీరును బట్టే పోస్టింగ్‌లు, రివార్డులు ఉంటాయన్నారు. జిల్లాలో నల్లబెల్లం, నాటుసారా పూర్తిస్థాయి నివారణకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. పోలీసుల పనితీరును బట్టే సమాజంలో గౌరవమర్యాదలు పెరుగుతాయన్నారు. జిల్లా పరిధిలో ఉన్న రహదారులపై రోడ్డుప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం పరిధిలో యూనిట్‌గా ఏర్పడి ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పెంచుకోవాలన్నారు. మత్తు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. నిరుపేద అంధుడు నాగన్న నూతన ఇంటి నిర్మాణానికి ప్రత్యేక చొరవతీసుకున్న ఎస్సై సతీష్‌ను, సిబ్బందిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, దాసరోజు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, యాదగిరిరెడ్డి, శేరి రామకృష్ణ, శ్రీరాంశేషయ్య, ఉల్లి శ్రీను, నలమాస రాజు పాల్గొన్నారు.



మౌన దీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

చలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కాళోజీ జంక్షన్, జూలై 28: పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న చలో హైదరాబాద్ సభకు వందలాదిగా పెన్షనర్లు తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల పెన్షనర్ల సమావేశం జరిగింది. దీనికి నర్సింహారెడ్డి అధ్యక్షత వహించగా, పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల కరువు భత్యం వాయిదాలను విడుదల చేయాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ధర్నాచౌక్ వద్ద నిర్వహించే మౌన దీక్ష కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 150 మంది పెన్షనర్లు పాల్గొనే విధంగా సంఘాల బాధ్యులు కృషి చేయాలని తీర్మానించారు. మార్కెట్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన 25మంది, స్పెషల్ టీచర్ల పక్షాన 20మంది మౌనదీక్షకు హాజరవుతామని నాగపురి సారయ్య, పెద్దూరి పెద్దన్న, సుధాకర్‌లు ప్రకటించడాన్ని సమావేశం స్వాగతించింది. చివరగా మౌన దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, జూలై 28: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఏషియన్ మాల్ ఎదురుగా ఉన్న సెయింట్ పాల్ స్కూల్ సమీపంలో ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన ప్రకారం.. సుబేదారి ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. ఇద్దరిని విచారించగా ఒకరు ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన విద్యార్థి చౌలం దొరబాబు, మరొకరు కమలాపురం గ్రామానికి చెందిన విద్యార్థి మంత్రి సంజయ్‌కుమార్ అని తెలిసినట్లు చెప్పారు. వీరిద్దరూ గంజాయికి బానిసై ఒడిషా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి హనుమకొండలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

రెండు జేసీబీలు, టిప్పర్ సీజ్



పట్టుబడిన జేసీబీలు, టిప్పర్‌ను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, జూలై 28: మండలంలో రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన ప్రకారం... లింగమోరిగూడెంలో నిల్వచేసిన మట్టితో కూడిన ఇసుకను అనుమతి లేకుండా జేసీబీ ద్వారా లోడింగ్ చేస్తుండగా పట్టుపడింది. అదేవిధంగా పున్నేలు శివారు వడ్డెరిగూడెంలో అనుమతి తీసుకోకుండా మొరంను టిప్పర్ ద్వారా తరలిస్తుండగా జేసీబీ, టిప్పర్ పట్టుపడ్డాయి. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండుగ్రామాల్లో 100 కాల్ ఆధారంగా వెంటనే స్పందించి ఇసుక, మొరం అక్రమ రవాణాను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

రూ. 2లక్షల 30వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూలై 28 : గంగారం మండలం పెద్దఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి తనకు తెలియకుండా రూ. 2లక్షల 30 వేలు మాయం కావడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. పెద్దఎల్లాపూర్‌కు చెందిన గుండగాని శ్రీధర్ ఖాతా నుంచి రూ. 2 లక్షల 30 వేలు డ్రా కావడంతో సైబర్ నేరగాళ్లు తన ఖాతా నుంచి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అనుమానాస్పద లింకులపై టచ్ చేయొద్దని, ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని ఎస్సై సూచించారు.

నేటి నుంచి దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీలు

వరంగల్ కల్చరల్, జూలై 28: రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైంది. సోమవారం బదిలీల ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈనెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది, వివిధ హోదాలు గ్రేడ్‌లలో ఉన్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. బదిలీల ప్రక్రియల నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈవోలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఈవోలు శనివారం రాత్రి హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణను కలిశారు. దాదాపు 125మంది ఈవోలు ఆర్‌జేసీని కలిశారు. బదిలీల ప్రక్రియ విషయంపై చర్చించినట్లు తెలిసింది. అన్ని స్థాయిల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జూలై 31తో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్థానచలనం కలగనుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 200కుపైగా ఆలయాలు ఉండగా వరంగల్ జిల్లాలో 60కిపైగా దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయాలు ఉన్నాయి. నగరంలో 25కు పైగా ఆలయాలు ఉన్నాయి. ఒక్కో ఆలయానికి ఇప్పటి వరకు మూడు నుంచి నలుగురు సిబ్బంది అవసరం ఉండగా ఒక్కరితోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఈవోలు, సిబ్బంది కొరత

ఒక్కో ఆలయానికి నలుగురు సిబ్బంది నాలుగో గ్రేడ్ ఉద్యోగులతోపాటు స్వీపర్, వాచ్‌మెన్‌లు ఉండాలి. వీరితోపాటు ఈవో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది కొరతతోపాటు ఈవోల కొరత కూడా ఉంది. ఒక్కొక్క ఈవోకు నాలుగు నుంచి ఐదు దేవాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. దీనికి తోడు ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన ఉద్యోగులు అసలు విధులే సరిగా నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 28: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓఆర్‌ఆర్‌పై ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు చెట్ల పొదల మధ్య గంజాయి సేవిస్తూ కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఖానాపురానికి చెందిన పి.రాజేష్, పి.అనిల్, ఎల్లాయిగూడెంకు చెందిన విపిన్ కుమార్‌గా గుర్తించారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



అరెస్టు అయిన ముగ్గురు యువకులు

కౌలు రైతుకు భరోసా

- పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం హామీ
- అప్రమత్తమవుతున్న వ్యసాయాధికారులు
- కౌలు రైతుల లెక్కల సేకరణలో నిమగ్నం
- కాంగ్రెస్ సర్కారు హామీతో కర్షకుల్లో ఆశలు



హనుమకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు మంచి రోజులు రానున్నాయి. ఈ వానాకాలం పంటల నుంచే కౌలు రైతులకూ పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలు రైతులకు సైతం ఏడాదికి రూ.15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కౌలుదారులకు రైతు భరోసా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిపై మార్గదర్శకాలను త్వరలోనే రూపొందిస్తామని తెలిపింది. ఈమేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందాయి. అధికారులు కూడా ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చే పనిలో నమగ్నమయ్యారు.

ఎకరాకు రూ.20వేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు 4,78,562 మంది ఉన్నారు. వీరికి ఎకరా నుంచి ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు తమకున్న కొద్దిపాటి భూమితో పాటు పక్కనున్న ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఫలితంగా వీళ్లు కూడా సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. దేవాదుల ఎత్తిపోతల, ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ ఆయకట్టు, ఇతర ప్రధాన రిజర్వాయర్లు, పెద్ద చెరువుల కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.20వేలను భూమి సొంతదారులకు చెల్లిస్తున్నారు. కాలువలు, కుంటలు, బోరు బావులు కింద సాగు చేసుకుంటున్న కౌలు రైతులు ఎకరాకు రూ.15వేల వరకు చెల్లిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరానికి రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు.

అప్పుల ఊబిలో..

వర్షాధార పంటల్లో ఇతర పంటలతో పోల్చితే ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కువమంది కౌలు రైతులు పత్తిసాగుకే మొగ్గు చూపుతున్నారు. పంట చేతికి వచ్చినా, రాకపోయినా కౌలును మాత్రం చెల్లించాల్సిందే. కౌలుతోపాటు పెట్టుబడులు పెట్టి పంటలు పండించడం వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలేమి వర్తించవు. బ్యాంకుల నుంచి కనీసం రుణాలు కూడా అందవు. అప్పులు చేసి పెట్టుబడులు తీసుకువస్తున్నారు. ప్రకృతి వైపరిత్యాలవల్ల పంట నష్టపోతే పరిహారం కూడా అందదు, అధిక వడ్డీ భారంతో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలా పలువురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సాగుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్నాయనీ చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రైతు భరోసాలో భాగంగా కౌలు డబ్బులు చెల్లిస్తే తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

గతంలో ప్రకటించి..

2014కు ముందు అప్పటి ప్రభుత్వాలు కౌలు రైతులకు అధీకృత కార్డులు పంపిణీ చేశాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఈ కార్డులు పని చేయడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన కర్షకులకు రైతు బంధు పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కౌలు రైతులకు మాత్రం ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. అధిక వడ్డీకి అప్పులు చేసి పంట ఉత్పత్తులను తిరిగి అదే వ్యాపారులు అమ్ముకోవాల్సి రావడంతో కౌలు రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

మార్గదర్శకాలు ఎప్పుడో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పట్టాదారులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు లేవు. అసలు వీరిని ఎలా గుర్తించాలనేదానిపై స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లాలోని మూడు లక్షలుపైగా కౌలు రైతులు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తుందని ఆశిస్తున్నారు. ఏటా హనుమకొండ జిల్లాలో 1.40 లక్షలు, వరంగల్ జిల్లాలో 2.50 లక్షలు, జనగామ జిల్లాలో 1.68 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 2.21 లక్షలు, ములుగు జిల్లాలో 1.10 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.12 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందితే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా, ఇప్పటివరకు కౌలు రైతులకు పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదృకాలు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మొదలైన కసరత్తు

కౌలు రైతులకు రైతు భరోసా అమలు దృష్ట్యా తాజాగా జిల్లాల వారీగా ఎంత విస్తీర్ణంలో వారు పంటలు పండిస్తున్నారో ఆరా తీస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి సీజన్ ఆరంభంలోనే ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏయే పంటలు సాగవుతున్నాయనే వివరాలను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) ప్రభుత్వానికి నివేదిస్తారు. ఇప్పటికే పట్టాదారు పాసు పుస్తకాలు కలిగిన రైతుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ప్రభుత్వం నుంచి రాత పూర్వక ఆదేశాలు అందగానే కౌలురైతుల వివరాలు సమర్పిస్తామని ఉమ్మడి ఇల్లాలోని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నిరాకరణ

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో భూము యజమానులు కలవరపడుతున్నారు. కౌలు రైతులకు పత్రాలు రాసిచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కౌలు పత్రాలు రాసిస్తే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమౌతామోనని భూయజమానులు భయపడుతున్నారు. ఒక వేళ కౌలు రైతులకు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇచ్చినట్లయితే కౌలు మొత్తాన్ని పెంచే యోచనలో ఉన్నారు. కాగా, గుర్తింపునకు ప్రామాణికమైన కౌలు పత్రాలు లేకపోతే రైతు భరోసా పథకానికి ఎక్కడ దూరమవుతాయని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

కౌలు రైతులు 3 లక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. 10.50 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో పట్టాదారు 9.50 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. వివిధ సాంకేతిక కారణాల వల్ల సుమారు లక్ష మందికి ఇప్పటికీ పట్టాదారు పాసు పుస్తకాలు రాలేదు. కాగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 3 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా. వీరిలో చాలామంది 3 నుంచి 5 ఎకరాల వరకు భూములను కౌలుకు తీసుకొని పంటలు పండించుకుంటున్నారు. వీరిలో 2 నుంచి 3 ఎకరాలు కౌలు తీసుకొన్నవారే ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.



మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్

కమ్మ కులస్థులకు దాన గుణం ఎక్కువ

న్యూశాయంపేట, జూలై28: కమ్మ కులస్థులకు దాన గుణం కలవారని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఫౌండర్, చైర్మన్ జెట్టి కుసుమకుమార్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గార్డెన్‌లో ఆషాఢమాస వనభోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జెట్టి కుసుమకుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కమ్మ కులస్థులు ఐక్యంగా ఉండాలన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా ప్రపంచంలో కమ్మ కులస్థులు ఎక్కడ ఉన్నా ఒక్క దగ్గర చేర్చి కులాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకెళదామన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కూచిపూడి నృత్యం, భరతనాట్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రావిపాటి వెంకటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు మాదాల కాశయ్య, పూర్వ అధ్యక్షుడు మాందాటి కోటేశ్వర్‌రావు, కమ్మం సంఘం నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారెడ్డి, పట్టాభిరామయ్య, నరేష్, రామచందర్‌రావు, కూనాటి హరిబాబు, వెంకటేశ్వర్లు, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, రాంబాబు, అనిల్‌కుమార్‌తోపాటు పెద్ద సంఖ్యలో కమ్మ కులస్థులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కమిటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, జూలై 28: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాముల పైడి, గునిగంటి రమేష్‌లను ఏకగ్రీంగా ఎంపిక చేసినట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఆదివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన 8వ డివిజన్ కుమార్‌పల్లిలోని న్యూలయోలా హైస్కూల్‌లో రాష్ట్ర కమిటీ సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికల పక్రియ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్యతో పాటు సీనియర్ న్యాయవాదులు షైదం జయపాల్, చేవూరి విజయ ముఖ్య అతిథిలుగా హాజరు కాగా, జిల్లా కమిటీలో పోటీ లేకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా చేవూరి విజయ, అధ్యక్షుడిగా శ్రీరాముల పైడి, ప్రధాన కార్యదర్శిగా గునిగంటి రమేష్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల రవి, పీసరి రజిత, రుద్రారపు హేమలత, జిల్లా కార్యదర్శులుగా ఎం.డి. హసీనా బేగం, తరాల సమ్మక్క, తరాల శంకర్, ప్రచార కార్యదర్శులుగా ఎం.డి. షహీదా బేగం, గుగులోతు సోనమ్మ, కార్యవర్గసభ్యులుగా భూక్యా అనసూర్య, బానాల మరియా, బోగి రాకేష్, సూడిద మహేందర్, బరిగెల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సాంబయ్య ప్రకటించారు. ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జాతారకం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క బిక్షపతి, కార్యదర్శి పార్నంది రమేష్‌చంద్ర, రాష్ట్ర నాయకులు కొంగర సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి

బాలసముద్రం, జూలై 28: వివాహాది శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు వినియోగించుకోవాలని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. వరంగల్-1 డిపో నుంచి అద్దె ప్రాతిపదికన పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడప్లస్ విహారయాత్రల కోసం 9959226047, 7382855793 నంబర్లను సంప్రదించాలని డీఎం మోహన్‌రావు అన్నారు.

సాహిత్యం సమాజ మార్గనిర్దేశనం చేయాలి..

గ్రంథావిష్కరణలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, జూలై 28: సాహిత్యం సార్వజనీనమైనదని, ఏ ప్రక్రియలో సాహిత్యం సృశించినా అది సమాజ మార్గనిర్దేశనం చేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలోని ఎలక్ట్రిసిటీ భవన్‌లో ఆచార్య బన్నా ఐలయ్య అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో వెటర్నరీ వైద్యుడు కాయిత వెంకటి కలం నుంచి జాలువారిన 7వ గ్రంథం నేను నా జీవిత ప్రస్థానాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపారమైన అనుభవాన్ని రంగరించి తన జీవితానుభవంలో ఎదురైన అనేక సంఘటనలు పాఠకులకు అనుకూలంగా ఆసక్తిగా మలచి రేపటి తరాలు ఆదర్శంగా తీసుకునేలా రాసిన రచయితను అభినందించారు. ప్రముఖ రచయిత్రి అరుణకీర్తి పతాక కరాజుల గ్రంథాన్ని సమీక్షిస్తూ దళితుల సమీక్షపై అనేక ఆసక్తికర సంఘటనలను అద్భుతంగా మలచి పాఠకులకు చేరువైనారని అన్నారు. కొన్ని సంఘటనల ఆధారంగా మలిచిన గేయాన్ని వినిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డాక్టర్ గిరిజా మనోహర్ బాబు, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ హరినాథ్‌రావు, నిధి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, తదితరప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సుకు అరసం వరంగల్ కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో సాహిత్య అభిమానులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

- ఐక్య విద్యార్థి సంఘాల నేతల వెల్లడి
- కేయూ వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మ దహనం



ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కేయూక్యాంపస్, జూలై 28: ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేసే విద్యా వ్యాపారాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రశ్నిస్తే విద్యార్థి సంఘాల నాయకులపై యజమానులు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని ఐక్య విద్యార్థిసంఘాల నేతలు హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కేయూ మొదటి గేటు వద్ద ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు చేస్తున్న విద్య వ్యాపారీకరణ, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలు, ఒకే బ్రాంచ్‌కి అనుమతి పొంది అనేక బ్రాంచ్‌లు నిర్వహించడం, ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశామని చెప్పారు. తమ అగడాలు బహిర్గతమవుతున్నాయనే అక్కసుతో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు హనుమకొండ కలెక్టర్‌కు తమపై వినతి పత్రాన్ని ఇవ్వడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై పోరాటం చేస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. నిజాయితీగా ప్రభుత్వ నిబంధనల మేరకు నడుస్తున్న కళాశాలల యాజమాన్యాలు తమతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. విద్యార్థి సంఘాలపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. తమ భవిష్యత్ కార్యాచరణ సోమవారం ప్రకటిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు రోహిత్, ఏబీవీపీ నాయకులు హర్షం చరణ్, ఇప్ప భరత్, ప్రణయ్, బీఎస్ఎఫ్ నాయకులు దాసరి అఖిల్, అరిస్టాటిల్, సృజన్, మల్లేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో ఇష్టారాజ్యం



- నగరంలో గల్లీకొకటి చొప్పున వందలాది హాస్టళ్ల ఏర్పాటు
- అనుమతులు, నిబంధనలు లేకుండా నిర్వహణ
- కలుషిత వాతావరణం, నాసిరకం భోజనంతో విద్యార్థుల అవస్థలు
- కొన్ని చోట్ల వ్యభిచారం, నేరాలకు అడ్డాగా మారిన వైనం
- అధికారులు, పోలీసులు దృష్టి పెట్టాలని వినతులు

హనుమకొండ టౌన్, జూలై 28: హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో ప్రైవేటు హాస్టళ్ల హవా నడుస్తోంది. కొంతమంది అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా హాస్టళ్లను ఏర్పాటు చేసి వ్యాపారంగా మలుచుకుంటున్నారు. హనుమకొండ నయీంనగర్, హంటర్‌రోడ్డు, చౌరస్తా, ములుగురోడ్డు, భీమారం, వరంగల్ రంగంపేట, పోచమ్మమైదాన్, పోస్టాఫీసు, రంగశాయిపేట, బొల్లికుంట, కాజీపేట, నిట్ ప్రాంతాల్లో కళాశాలలను అడ్డాగా చేసుకొని వందలాది హాస్టళ్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఎలాంటి అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రమాణాలు కరువు

ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వరంగల్ నగరానికి చదువులు, ఉద్యోగాలు, వివిధ పనుల కోసం చాలామంది వస్తుంటారు. సొంతంగా రూమ్‌లు తీసుకుని ఉండడం భారమైన వారు.. ప్రైవేటు హాస్టళ్లను ఆశ్రయిస్తుంటారు. అక్కడ నిర్వాహకులు చెప్పిన ఫీజును చెల్లించి ఉంటున్నారు. అయితే అదే అదునుగా భావించిన కొంత మంది నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులే పరమావధిగా భావిస్తూ ఎవరు వచ్చినా హాస్టల్‌లో చేర్చుకోవడమే పనిగా పెట్టుకున్నారు. అడ్మిషన్ తీసుకున్న వారు ఇచ్చిన చిరునామా నిజమైనదేనా? అనేది చూడరు. ప్రైవేటు హాస్టల్‌లో మెయింటెనెన్స్ రిజిస్టర్ కనిపించదు. హాస్టల్‌లో దేని కోసం ఉంటున్నారు? హాస్టల్‌లో ఎలా ఉంటున్నారు? పక్కవారితో ఎలా ప్రవర్తిసున్నారు? రోజూ రాత్రి హాస్టల్‌లో ఉంటున్నారా? లేదా? అనేదానిపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా లేడీస్ హాస్టల్స్ వద్ద రక్షణ లేకుండా పోయింది. వాచ్‌మెన్‌లను నియమించడం లేదు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోరు. ఫైర్ సెఫ్టీ ఉండదు. కేవలం నాలుగు గదుల ఇల్లు దొరికితే చాలు.. తెల్లారేకల్లా హాస్టల్ అంటూ బోర్డు పెట్టి ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్లలోనే నిర్వాహకులు నివాసం ఉంటుండడంతో శుభకార్యాలు, మందుపార్టీలు చేసుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలున్నాయి. కొన్ని హాస్టళ్లను అనుకొని లాడ్జీలు నెలకొల్పబడ్డాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల తనిఖీలేవి?

నగరంలోని ప్రైవేటు హాస్టళ్లలో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ఇక్కడ ఆహారం ఎలా తయారు చేస్తున్నారు? శుభ్రత పాటిస్తున్నారా? అనే దానిపై అధికారులు ఏనాడూ పరిశీలించిన పాపాన పోలేదు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రైవేట్ వసతి గృహాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేయగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కుళ్లిపోయిన కూరగాయలు, శుభ్రతలేని కిచెన్, కలుషితమైన నీరు.. ఇలా రకరకాల సమస్యలు బయటపడ్డాయి. అదే తరహాలో వరంగల్ నగరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులతో పాటు మునిసిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు జరిపి హాస్టళ్లలో చోటుచేసుకుంటున్న అక్రమాలు, నేరాలను అరికట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొంతమంది రెండు, అంత కన్నా ఎక్కువ హాస్టళ్ల నిర్వహిస్తున్నారని, అలాంటి వారు రేషన్‌బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాంటి వారిపై దృష్టిసారించి నియంత్రించాల్సిన అవసరం ఉంది.

కొన్ని సంఘటనలు

- ఒక మహిళ వివాహం చేసుకొని భర్తను వదిలిపెట్టి హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్‌లో ఉంటూనే బయట వేరే గది కిరాయి తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తోంది. విటుడు దొరికినప్పుడు రూమ్‌లో గడిపి వస్తుంటుంది. ఈ క్రమంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేయగా మహిళను అదుపులోకి తీసుకొని వదిలేశారు. మహిళ ఒక్కరే ఈ వ్యభిచారంలో పాల్గొనేదా..? హాస్టల్లో ఉన్న అమ్మాయిలకు డబ్బు ఎరవేసి ఈ రొంపిలోకి దింపిందా? అనేదానిపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.
- నయీంనగర్ పెద్దమోరీ సమీపంలో హాస్టల్‌లో ఉంటూ ఓ మహిళ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈ మహిళ స్నానం చేస్తున్నప్పుడు హాస్టల్ నిర్వాహకుడు బాత్‌రూమ్‌లోకి చొరబడి లొంగదీసుకున్నాడు. దాన్ని ఆసరాగా చేసుకొని లైంగికంగా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- కోరుట్లకు చెందిన ఇద్దరు అమ్మాయిలు స్వలింగ సంపర్కులుగా మారి హాస్టల్‌లోనే కాపురం పెట్టారు. నిత్యం రూమ్‌లోకి పోయి తలుపులు పెట్టుకోవడం.. ఇద్దరు కలిసి స్నానం చేయడంతో పాటు అందరిముందే అసభ్యకంగా ప్రవర్తిస్తుండటంతో పోలీసుల కౌన్సెలింగ్ నిర్వహించి హాస్టల్‌ను ఖాళీ చేయించారు.
- ఓ హాస్టల్‌లో అసౌకర్యాలతోపాటు ఫెూరాలపై ప్రశ్నించిన యువతిని హాస్టల్ అసోసియేషన్స్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నిర్వాహకుడు ఇష్టానుసారంగా దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.
- కిషన్‌పురలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న డిగ్రీ విద్యార్థిని ప్రతీ రోజు రాత్రి బయటికి వెళ్లి తిరిగి ఉదయం హాస్టల్‌కు చేరుకుంటోంది. రోజూ అదే పనిగా వెళ్లి వస్తుండటంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకుపోగా బాయ్‌ఫ్రెండ్ రూమ్‌కు వెళ్తున్నట్లుగా పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.
- నయీంనగర్ రంగ్‌బార్ సమీపంలో గర్ల్స్, బాయ్స్ హాస్టల్స్ పక్కపక్కనే ఉండటంతో వెకిలిచేష్టలు, అసభ్య ప్రవర్తన చేయడంతో గర్ల్స్ హాస్టల్ నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి బాయ్స్ హాస్టల్ నిర్వాహకుడితోపాటు, యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మెటీరియల్ రిలీజ్‌కు ఈ-స్టోర్ విధానం

హనుమకొండ టౌన్, జూలై 28: వినియోగదారులకు సత్వరమే సేవలందించడంలో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్‌లో కొత్తగా ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వరంగల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సెక్షన్ ఏఈ మొదటగా ఒక పనికి కావల్సిన మెటీరియల్ స్టాక్ ఉందో లేదో సాప్(ఎస్‌ఏపీ)సాఫ్ట్‌వేర్‌లో, ఆన్‌లైన్‌లో చూసుకొని ఆ మెటీరియల్‌ను రిజర్వు చేసుకుంటారని పేర్కొన్నారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్‌కు సంబంధించిన సమాచారం ఎస్‌ఏపీ వర్క్‌ఫ్లో ద్వారా సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కి వర్క్‌ఫ్లో ద్వారా ఆన్‌లైన్‌లో వెళుతుందని తెలిపారు. మెటీరియల్ తీసుకోవడానికి ఏ రోజు రావాలో తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో, ఎస్‌ఏపీ మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందని వివరించారు. తెలియజేసిన తేదీ సమయానికి స్టోర్‌కు వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దీనిలో పేపర్ ప్రస్తావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రవేశపెట్టక ముందు కావాల్సిన మెటీరియల్ లిస్టును ప్రింట్ తీసుకొని సంతకాలు తీసుకొని ఆ పేపర్ సంబంధిత అధికారికి అందజేసి సామగ్రిని తీసుకోవల్సి ఉండేదని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికే ఈ-స్టోర్ విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఏపీ టీం చేశారని తెలిపారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు 24గంటల పాటు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు.

శ్రీపతిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

చిలుపూర్, జూలై 28 : మండలంలోని శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రశాంత్, నాగరాజు, శేఖర్ నేతృత్వంలో జరిగిన సమ్మేళనానికి 2010 -11 సంవత్సరంలో పదో తరగతి చదివినవారు హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు అరుణాదేవి, ప్రతాప్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, కొమురయ్య, కల్యాణిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజు, శేఖర్, ప్రవీణ్, మంగ, ప్రసన్న, అశ్విని, రమ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తాటికొండ ఉన్నత పాఠశాలలో..



ముప్పై ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 28: మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1993-94 విద్యా సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 30 ఏళ్ల తరువాత కలుసుకొని మురిసిపోయారు. గత స్మృతులను గుర్తు చేసుకొని సంతోషాన్ని పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉబ్బని మల్లేషం, అక్కెనపల్లి అంజయ్య, కుంబోజి రాములు, ఎమ్డీ సాజిద్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ కళావేదిక అధ్యక్షుడి ఎన్నిక



కర్రెల్లి సంపత్

చిలుపూర్, జూలై 28: తెలంగాణ నిరుద్యోగ కళావేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా మల్కాపూర్‌కు చెందిన కర్రెల్లి సంపత్ నియమితులయ్యారు. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరెకంటి కిరన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ నిరుద్యోగ కళాకారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

జనగామ రూరల్, జూలై 28: ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించారని నిరసన తెలిపిన తమపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. కేసులను ఎత్తివేయని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లవకుమార్, సాగర్, మురళి పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న యువకుడి ఆచూకీ లభ్యం

మృతుడు కరీంనగర్ జిల్లా వాసిగా గుర్తింపు

జనగామ రూరల్, జూలై 28: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న యువకుడి ఆచూకీ లభ్యమైంది. ముందుగా గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులను ఆశ్రయించారు. బాధితుడు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన ఏనుగు వాసుదేవరెడ్డి(19)అని, తను మేడ్చల్ సీఎంఆర్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడని, ఫస్ట్ ఇయర్‌లో కొన్ని సబ్జెక్ట్‌లు ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ధరల మంట.. వంట ఏజెన్సీల తంటా

మధ్యాహ్న భోజనంపై కూరగాయల ధరల ప్రభావం

బిల్లులు రాక ఇబ్బందిపడుతున్న నిర్వాహకులు



పాలకుర్తిలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

పాలకుర్తి, జూలై 28: మార్కెట్‌లో పెరిగిన కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రభావం చూపుతున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఆకలి వెతలు తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇటీవల నిత్యవసరాలతో పాటు కూరగాయలు ధరలు పెరగడంతో పథకం అమలులో ఏజన్సీ మహిళలు అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలంటే ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో నానా అవస్థలు పడుతున్నారు.

సర్కార్ బడుల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రూ5.45 పైసలు.. ఆరు నుంచి ఎనమిదో తరగతి విద్యార్థులకు కోడి గుడ్డు కాకుండా రూ. 8. 17 పైసలు.. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రూ. కోడి గుడ్డుతో పాటు రూ. 10.67 పైసల చొప్పున మధ్యాహ్న భోజనానికి చెల్లిస్తున్నారు. అయితే పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకుంటే చెల్లింపులు సరిపోవడంలేదనేది ఏజెన్సీల వాదన. మధ్యాహ్న భోజనం పథకం అమలుకు 1 నుంచి 8 తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం చొప్పున నిధులను కేటాయిస్తున్నాయి. 9, 10 తరగతుల విద్యార్థులకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 100 గ్రాములు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. పప్పులు, నూనె, కూరగాయలు, ఇతర వంట సామగ్రి, వంట గ్యాస్, కుకింగ్ కాస్ట్ కింద బిల్లులను గత జనవరి వరకు చెల్లించింది. భోజన బిల్లు లు మార్చి నెల వరకు చెల్లించారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది జనవరి నంచి వేసవి సెలవుల నాటికి పెండింగ్‌లో ఉన్నాయి.

మండలాలవారీగా ప్రభుత్వ పాఠశాలల వివరాలు

మండలం	పీఎస్‌లు	యూపీఎస్‌లు	జడ్పీ హైస్కూల్స్
బచ్చన్నపేట	30	5	10
చిల్పూరు	25	4	10
దేవరుప్పుల	35	7	11
స్టేషన్‌ఘన్‌పూర్	22	6	14
కొడకండ్ల	23	7	4
లింగాలఘనపురం	18	6	9
జనగామ	35	9	16
నర్మెట	23	3	8
పాలకుర్తి	55	4	12
తరిగొప్పుల	13	6	4
జఫర్‌గడ్	20	7	7
రఘునాథపల్లి	44	2	15
మొత్తం	**343**	**66**	**120**

మండుతున్న కూరగాయల ధరలు..

మార్కెట్‌లో కూరగాయల ధరల పెరుగుదలతో వంట ఏజెన్సీల మహిళలు బెంబేలెత్తుతున్నారు. మార్కెట్‌లో కిలో టమాటా రూ.80, కాకర రూ.80, బీరకాయ రూ. 80, దొండ రూ.70, బెండకాయ రూ.80, మిర్చి రూ.80, చిక్కుడు రూ.80 దోసకాయ రూ.80, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.90 ధర పలుకుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులను సవరించకపోవడంతో తమపై ఆర్థిక భారం పడుతోందని, అప్పులు చేసి పిల్లలకు వంట చేసి పెడుతున్నామని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేటు గిట్టుబాటు కావడం లేదు..

రాపాక భాగ్యమ్మ, పాలకుర్తి, నిర్వాహకురాలు



కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో మెనూ ప్రకారం భోజనం అందించడం ఇబ్బంది అవుతోంది. నాలుగు నెలల నుంచి కోడిగుడ్ల బకాయిలు రావడం లేదు. రూ.70 వేలు వ్యాపారికి ఇవ్వాల్సి ఉంది. అప్పులు తెచ్చి వంట చేసి పెడుతున్నాం. ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లతో పాటు కూరగాయలు, సరుకులు అందిస్తే సజావుగా విద్యార్థులకు భోజనం అందించే అవకాశం ఉంటుంది.

బకాయిల మంజూరుకి కృషి చేస్తా..

కె.రాము, జిల్లా విద్యాశాఖ అధికారి



గత విద్యాసంవత్సరం బకాయిల చెల్లింపునకు నిధులు విడుదల అయ్యాయి. తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల భోజన బిల్లులు మాత్రం ఈ ఏడాది మార్చి నుంచి చెల్లించాల్సి ఉంది. బకాయిల వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించాం. నిధులు విడుదల కాగానే చెల్లిస్తాం.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



కనకయ్య కుటుంబానికి రూ.50వేలు అందిస్తున్న బాల్యమిత్రులు

నర్మెట, జూలై 28: పదో తరగతి వరకు తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా అతడి కుటుంబానికి బాల్యమిత్రులు అండగా నిలిచారు. నర్మెటకు చెందిన ప్రజ్ఞాపురం కనకయ్య ఐదు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం 1990-91 బ్యాచ్ విద్యార్థులు కనకయ్య భార్య విజయకు రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. వారిలో బత్తుల నరేందర్, యెలగొండ రవి, పాతూరి అంజనేయులు, తాండ్ర వీరారెడ్డి, కన్నెబోయిన రామకృష్ణ, ప్రజ్ఞాపురం శ్రీనివాస్, మూల కర్ణాకర్, ఆకోజు బ్రహ్మాచారి, ఏసళ్ల కనకయ్య, బూరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విశ్వనాథుల కృష్ణమూర్తి, బైరగోని చంద్రమౌళి, బానోతు బాలు, పీర్య, నిమ్మకంటి కనకయ్య ఉన్నారు.

స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలు బీజేపీవే



పాలకుర్తిలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పాలకుర్తి, జూలై 28 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, దుంపల సంపత్, రాణా ప్రతాప్, కొడిశాల యాదగిరి, సమ్మయ్య చారి, సైదులు, వెంకన్న, రాజుఖనాయక్, సురేష్, మంచినీళ్ల ఉపేందర్‌రెడ్డి, సోమేశ్వర్ పాల్గొన్నారు.

'రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి'

నర్మెట, జూలై 28 : సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ధరావత్ రమేష్‌నాయక్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలకేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయక్ మాట్లాడుతూ ఆగస్టు 9న సరూర్‌నగర్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగే ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేందర్‌నాయక్, ధరావత్ రాజు, కిష్టయ్య, శంకర్‌నాయక్, మధు, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.కుమార్ గౌడ్

రఘునాథపల్లి, జూలై 28: కబడ్డీ క్రీడాకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.కుమార్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలను నిర్వహించాలని, ఇందుకు క్రీడా భిమానులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో సారంగపాణి, మల్లారెడ్డి, మోహన్ రావు, వెంకట రెడ్డి, అంజనేయులు, గట్టయ్య, సురేందర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పోగుల సారంగపాణి, అధ్యక్షుడిగా వై.కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, రాజ్‌కుమార్, మోహన్ రావు, రాజన్న యాదవ్, అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా టి.గట్టయ్య, కోశాధికారిగా ఇ.ఉప్పలయ్య, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, కుమార్, సందీప్, సురేష్, శ్రీకాంత్, మల్లేష్, సురేందర్, రమేష్ ఎన్నికయ్యారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జనగామ జర్నలిస్టులు

జనగామ రూరల్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వరంగల్‌కు వెళ్తున్న క్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఇర్రి మల్లారెడ్డి, కార్యదర్శి సురిగెల భిక్షపతి ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జిల్లా కేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డుతో పాటు గృహ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'ను వీక్షించిన బీజేపీ శ్రేణులు

జఫర్‌గడ్, జూలై 28: రాబోయే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల నేపథ్యంలో హర్ ఘర్ తిరంగా పేరుతో ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రధాని మోదీ ప్రజలను కోరారు. ఆదివారం నిర్వహించిన 112వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత క్రీడాకారులకు అందరూ అండగా నిలిచి ప్రోత్సహించాలన్నారు. స్వదేశీ వస్తువుల తయారీ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా చేనేతకు సంబంధించిన ఖద్దర్ విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. సమైక్యత, సమగ్రతతో సంస్కృతిని చాటి చెపుతూ ముందుకు సాగాలని అన్నారు. కాగా, ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వీక్షించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ తెలిపారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగారపు రమేశ్, తిరుపతి, గాదెపాక చిరంజీవి, ఇల్లందుల సారయ్య, శ్రీనివాస్, గాదెపాక శ్వేత, సాయిరాం, లింగన్న, గణేష్, చీకటి శ్రీనివాస్, పిట్ట రాజు, చిరబోయిన కవిత, రమేశ్, అరవింద్, యాకయ్య, నరేశ్, తదితరులు ఉన్నారు.

రైతుకు పాముకాటు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 28: మండలంలోని చంద్రు తండా గ్రామానికి చెందిన బానోతు యాదగిరిని ఆదివారం పాము కాటువేసింది. వ్యవసాయబావి వద్ద పనులు చేస్తున్న క్రమంలో కట్లపాము కాలు మడిమపై కాటు వేయగా సమీపంలోని రైతుల సహాయంతో వెంటనే ఆటోలో ఘన్‌పూర్ పీహెచ్‌సీకి వెళ్లారు. డాక్టర్లు ఇంజక్షన్ వేసి అబ్జర్వేషన్లో ఉంచారు. 24గంటల పాటు వైద్యుల ప్రవేక్షణలో ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని సిబ్బంది తెలిపారు.

ఐఈఎస్ ర్యాంకర్‌కు సన్మానం



అభిషేక్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 28: ఇటీవల ఐఈఎస్ (ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు)లో 42వ ర్యాంకు సాధించి, నేషినల్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు, జాతీయ రహదారుల అధికారిగా నియమించబడిన వేముగంటి అభిషేక్‌ను ఆదివారం ఘన్‌పూర్‌లో మున్నూరుకాపు సంఘం నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొంతం శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయస్థాయి కొలువుకు యువకుడు ఎంపిక కావడం గర్వకారణమని, గ్రామం పేరునే జాతీయ స్థాయిలో నిలుపడం అభినందనీయమని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేబట్టి గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు, మంగు జయప్రకాష్, నాయకులు తోట భిక్షపతి, తోట సత్యం, వేణు, రమేష్, రాహుల్, రాజు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సమావేశం

జనగామ రూరల్, జూలై 28: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు ఏ విధంగా ఓటింగ్‌లో పాల్గొనాలో అవగాహన కల్పించామన్నారు. అధిష్ఠానానికి అనుగుణంగా అందరూ కలిసికట్టుగా ఒకే ప్యానల్‌గా ఎన్నికల్లో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్ కృష్ణన్, కమలాకర్ యాదవ్, దాసరి క్రాంతి, కర్ర సంతోష్ రెడ్డి, దాసరి శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు వినతి

బచ్చన్నపేట, జూలై 28: చేనేత కార్మికుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు మచ్చ సందీప్‌కుమార్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కోరారు. ఆదివారం ఆయన మల్లన్నను కలిసి చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. కళ్యాణలక్ష్మీ పథకంలో చేనేత పట్టుచీరను అందిస్తూ నేత కార్మికులను ప్రోత్సహించాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి వచ్చేలా శాసనమండలిలో మాట్లాడి చేనేత కార్మికులకు అండగా నిలువాలని సందీప్‌కుమార్ కోరారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

పాలకుర్తి, జూలై 28 : మండలంలోని మంచుప్పుల గ్రామానికి చెందిన గుండ్ల సైదులు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పాఠశాల చుట్టూ కానరాని పరిశుభ్రత

కస్తూర్బా విద్యాలయం ప్రహరీ చుట్టూ నిలిచిన మురుగునీరు - పెరిగిన పిచ్చి మొక్కలు



పాఠశాల పక్కనే పందుల గుంపు సంచారం



కేజీబీవీ ప్రహరీని అనుకుని పెరిగిన పిచ్చి చెట్లు

బచ్చన్నపేట, జూలై 28: వర్షాలు కురుస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమల ఉధృతి పెరిగి జనం రోగాల బారిన పడుతారని అధికారులు ఓ వైపు హెచ్చరిస్తుంటారు. ఒకరోజు డ్రైడే పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ప్రచారం చేస్తున్నారు. మరోవైపు మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రహరీని ఆనుకుని మురుగు నీరు నిలిచి కుంటలా మారింది. ఇందులో పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు పెరిగి దోమల ఉధృతికి కారణమవుతోంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కస్తూర్బా విద్యాలయంలో పెద్ద సంఖ్యలో బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వారికి దోమలు కుట్టి అనారోగ్యం పాలైతే ఎట్లా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గోపాల్‌నగర్‌లో నివాసముంటున్న అనేక కుటుంబాల ఇళ్లల్లో నుంచి మురుగునీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో కేజీబీవీ చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

జఫర్‌గడ్‌లో అధ్వానంగా రోడ్లు ● అవస్థలు పడుతున్న ప్రజలు



జఫర్‌గడ్‌లో నీటి కుంటను తలపిస్తున్న రోడ్డు

జఫర్‌గడ్, జూలై 28 : గ్రామాల్లో రోడ్లు చినుకు పడితే చిత్తడవుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే బురదయమయంగా మారి నడవలేని స్థితి నెలకొంటోంది. జఫర్‌గడ్‌లోని పలు వీధులు, కాలనీల్లో రోడ్లు అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు బురదతో చిత్తడిగా మారాయి. కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి. బురదలో ఎక్కడ జారి పడతామోనని జనం ఆందోళన చెందుతున్నారు. గ్రామ సెంటర్‌లో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రధాన బీటీ రోడ్డు వరకు పూర్తి చేయకుండా వదిలేయడంలో వర్షం కురిసినపుడు ఆ రోడ్డు నీటి కుంటలా మారుతోంది. ఆర్టీసీ బస్సులు, వాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రభుత్వ కార్యాలయాలకు, సంతకు, గ్రామాలకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. బీసీ కాలనీలో వీధులు వర్షానికి జారుడుగా బురదమయంగా మారాయి. ముస్లీం వీధిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంటల్లో నీరు నిలిచి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఎస్సీ కాలనీతో పాటు ఇంకా పలు వీధుల్లో తుమ్మ చెట్లు, చెత్త చెదారంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయడంతో పాటు కాలనీల్లో రోడ్లను నిర్మించాలని, ఖాళీ స్థలాల్లోని చెట్లను తొలగించి, మురుగు కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బీసీ కాలనీలో బురదమయమైన రోడ్డు